వ్యాధుల కాలం.. జర భద్రం

- వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
- పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం
- డ్రైడే ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది


దోమలు వృద్ధి చెందకుండా మందు చల్లుతున్న ఆశా కార్యకర్తలు

మాగనూర్: వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వ్యాపించవచ్చు. కలుషిత నీటి వల్ల కూడా అనారోగ్యానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. అయితే ముందుగానే అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవు.

పరిసరాల శుభ్రతతో సగం వ్యాధులు దూరం

వర్షాకాలంలో తమ చుట్టూ ఉన్న పరిసరాలను చెత్త, చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకుంటే సగం వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. ఎందుకంటే మన ఇంటి చుట్టూ చెత్త, చెదారం, పిచ్చి మొక్కలు, వర్షపునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులు మనుషులను కోలుకోలేకుండా చేస్తాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం

- ఇంటి పరిసరాలను రోజు శుభ్రం చేసుకోవాలి.
- వర్షాకాలంలో కొత్త నీరు వస్తుంది. ఈ క్రమంలో తాగునీటిని కాచీ చల్లార్చిన తరువాతే తాగాలి. లేదంటే క్లోరినేషన్ చేసిన నీటిని తాగడం మంచిది.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, గుంతల్లో నీరు నిల్వ ఉంటే దానిని ఎప్పటికప్పుడూ తొలగించాలి.
- ఇంట్లో పెంచుకుంటున్న అలంకరణ మొక్కలను తరచూ శుభ్రం చేస్తుండాలి.
- ప్రతిరోజు డ్రమ్ముల్లో నీటిని పారబోస్తూ.. కొత్త నీటిని నింపుకోవాలి.
- ఇంట్లో ఎవరైనా వాంతులు, విరేచనాలతో బాధ పడుతుంటే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- రాత్రి వేళ్లో దోమ తెరలను తప్పనిసరిగా వాడాలి.

రోజూ పారిశుద్ధ్య పనులు


గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజు శానిటైజేషన్ పనులు చేయిస్తున్నాం. అలాగే గ్రామాల్లో సేకరించిన చెత్తను రోజూ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. డ్రైయినేజీల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయిస్తున్నాం. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం

–తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి, మాగనూర్

ఫ్రైడే.. డ్రైడేను విధిగా పాటిస్తున్నాం


మండలంలో ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడేను విధిగా పాటిస్తున్నాం. ఇళ్లల్లోని పాత డ్రమ్ములు, టైర్లు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తూ కలుషిత వీటి వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు తెలియజేస్తున్నాం. అలాగే అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చెల్లించి వ్యాధులు వ్యాపించకుండా చూస్తున్నాం.

–అఫ్రోజ్, డాక్టర్, మాగనూర్

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


వసతి గృహ విద్యార్థులతో వెంకటేష్

నారాయణపేట రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శాతవాహన కాలనీలో గల బీసీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. హాస్టల్‌కు అన్ని వసతులతో కూడిన సొంత భవనాన్ని నిర్మించాలని, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూత్రశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడం, మంచినీటి ట్యాంకు పరిస్థితి గోరంగా ఉందని విమర్శించారు. భోజన విషయంలో నాణ్యత పాటించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో దీపక్, రమేష్, వెంకటేష్, ఆనంద్, కిరణ్, రవి, శివ, శ్రీకాంత్, గణేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని మార్కెట్ లైన్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1998–99లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలుసుకొని గెట్ టు గెదర్ నిర్వహించుకొన్నారు. ఈ సందర్భంగా మిత్రులందరూ తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అలాగే ప్రస్తుతం తమ ఉద్యోగ, వ్యాపార వివరాలను పంచుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులని సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బస్వరాజు, వేణుగోపాల్, సుశీల, దత్తు రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేసుకున్న గ్రామస్తులు


రోడ్డుపై మట్టివేసి గుంతలను పూడుస్తున్న గ్రామస్తులు

దామరగిద్ద: మండలంలోని మారుమూల గ్రామమైన ఉల్లిగుండం గ్రామం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు దాదాపు 4 కిలోమీటర్ల బీటీ రోడ్డు కాలం చెల్లి గుంతల మయంగా మారింది. దీంతో ఆదివారం స్థానిక నాయకులు పార్టీలకు అతీతంగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. స్థానిక ట్రాక్టర్ యజమానులు తమ సొంత ట్రాక్టర్‌లలో జేసీబీల సాయంతో మట్టిని తరలించి గుంతలు పూడ్చారు. ఉల్లిగుండం గ్రామానికి వెళ్లే రోడ్డును బాగు చేయడానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులే రోడ్డుపై మట్టిపోసి గుంతలు పూడ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావ్, తిరుపతి, నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, కిష్టారెడ్డి, సాయిరెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

‘ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ‘ఏ’లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రిటైర్డ్ ముదిరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది ముదిరాజ్‌లను గెలిపించాలని కోరారు. అందరూ చైతన్యవంతులై రాజకీయంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, నారాయణ, కోట్ల హనుమంతు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాలకు న్యాయం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం

నారాయణపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి వారికి అండగా నిలబడిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. ఆదివారం నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని, అంబేడ్కర్, మహాత్మా గాంధీలతో పాటు దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న మహనీయులను కించ పరిచే విధంగా మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. స్థానిక సంస్థలు ఎన్నికలు రానుండడంతో ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు వారి తప్పుడు మాటలు నమ్మకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. అనంతరం వార్డు కమిటీని ఎన్నుకున్నారు. వార్డ్ అధ్యక్షుడిగా సిద్ధం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా అవుట్ వీరేష్,లతో పాటు కార్యదర్శిగా గొల్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా సమీర్ షేక్,లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్వ. మనోజ్,దొడ్డి కార్తీక్,బోయ వెంకటప్ప, మసి పవన్, హసనుద్దీన్,ఎరుకలి వెంకటయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో కులాన్ని ఆపాదించకండి

మద్దూరు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఒక కులానికి చెందిన వారికి నష్టం జరుగుతుందని సామాజిక మాధ్యమాల్లో పోస్టుల పెట్టడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మార్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల నుంచి మోమినాపూర్ మీదుగా అభంగాపూర్ వరకు డబుల్ రోడ్డును ఏర్పాటు చేస్తుండడంతో రెనివట్ల గ్రామంలో అన్ని కులాల వారికి చెందిన ఇళ్లను కూల్చివేసినట్లు తెలిపారు. నష్టపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరుకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఈ గ్రామానికి చెందిన ఆంజనేయులు ముదిరాజ్‌కు చెందిన ఇల్లు కూల్చే క్రమంలో ప్రతిపక్షాలకు చెందిన నాయకులు కులాన్ని ఆపాదించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. ఆంజనేయులు ఇల్లు పడగొడితే 5 ఫీట్లు మాత్రమే కోల్పోతాడని అనేక మంది తమ ఇళ్లను పూర్తిగా కోల్పోయారని గుర్తు చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

10 వేల మొక్కలు నాటిన సిబ్బంది

మరికల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ చుట్టూ ఆదివారం సిబ్బంది మొక్కలు నాటారు. కంపెనీ ఎండీ మోహన్‌రావు జ్ఞాపకార్థంగా పది వేల మొక్కలను నాటినట్లు సిబ్బంది తెలిపారు. మును ముందు ఆయన జ్ఞాపకర్థంగా మరిన్ని మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

దామరగిద్ద: నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని క్యాతన్‌పల్లి శక్తి కేంద్రం రచ్చబండ కార్యక్రమంలో 11 ఏళ్ల మోదీ పరిపాలనపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, విద్యా, వైద్యం, ఉపాధి హామీ, రేషన్ సరుకుల పంపిణీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. మోదీ చేసిన అభివృద్ధిని ఇంటింటికి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోపాల్‌రావ్ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అబ్దుల్‌నబీ, అంజిలయ్యగౌడ్, సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్‌పాస్ ఇలా.. ప్రయాణం ఎలా..?



నర్వ: మండలంలోని రాయికోడ్–సీపూర్ గ్రామా ల మధ్య ఉన్న అండర్ పాస్ బ్రిడ్జి కింద నిత్యం నీళ్లు నిలిచి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. భూత్పూరు కెనాల్ కింద వేసిన ఈ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం సరిగ్గా చేయకపోవడంతో నీళ్లు నిలిచి ప్రయాణించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. పెద్ద వాహనాలే సగం వరకు మునిగిపోతున్నాయని ఇక బైక్‌ల గురించి చెప్పనక్కర్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం చేసినప్పటీ నుంచి గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితి ఇలానే ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆటోడ్రైవర్స్ ధర్నాను విజయవంతం చేద్దాం


కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మద్దూరు: రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జూలై 1న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వం ఫ్రీ బస్సులను ఏర్పాటు చేయడం వల్ల ఆటో డ్రైవర్ల రోడ్డున పడ్డారని వారి ఆదుకోవడానికి ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేల భృతిని అందజేయాలని, 55 ఏళ్లకు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అశోక్, అంజిలయ్య, శ్రీనివాస్, ఆటో డ్రైవర్లు సత్యనారాయణ, ముకుందారెడ్డి, సురేష్, గోవింద్, సాయిరెడ్డి, బస్వరాజ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిద్దాం


ఊట్కూరులో చిన్నారులతో కలిసి మొక్క నాటుతున్న మన్సూర్ అలీ

ఊట్కూరు: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిద్దామని చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మన్సూర్ అలీ అన్నారు. ఆయన ఆదివారం ఊట్కూరులో చిన్నారులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పర్యావరణం పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షాకాలంలో ఒక్కొక్క విద్యార్థి 5 మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఊట్కూరు అధ్యక్షులు మహమ్మద్‌జావీద్, నాయకులు అబ్దుల్ రశీద్, రహమత్ నిషా బేగం, రఫీ, ఖాదర్ పాల్గొన్నారు.

వంతెన.. పూర్తయ్యేదెన్నడో..?

- నత్తనడకన బ్రిడ్జి నిర్మాణ పనులు
- ఇసుక కొరతతో పనుల్లో జాప్యం


శరవేగంగా మన్నాపూర్–అల్లీపూర్ బీటీ రోడ్డు విస్తరణ పనులు


గుంతలకే పరిమితమైన వంతెన నిర్మాణం

కొత్తపల్లి: మండలవాసుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం మండలంలోని కొత్తపల్లి బూనీడు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు రూ.10 కోట్లతో 100 మీటర్లు పొడువుతో బ్రిడ్జి నిర్మాణం మొదలుపెట్టారు. అయితే నిర్మాణం ప్రారంభించి మూడు నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ఇంకా పునాదులకే పరిమితమయ్యాయి. నిర్మాణానికి కావాలసిన ఇసుక పక్కనే ఉన్నా వాడుకునే అవకాశం లేకపోవడంతో నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నా గుత్తేదారు నిర్లక్ష్యంతో కింది స్థాయి సిబ్బంది ఇసుకను అక్రమంగా విక్రయిస్తుండడంతో వంతెన నిర్మాణ పనుల్లో ఆలస్యం జరుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక వర్షాకాలం ప్రారంభం కావడంతో నిర్మాణంలో భాగంగా తీసిన పునాదుల్లో నీరు చేరి పనులు ఇంకా ఆలస్యం అవుతున్నాయి. అయితే ఇదే వాగుపై నిర్మాణం అవుతున్న మన్నాపూర్–అల్లీపూర్ బ్రిడ్జి పనులు మాత్రం చకచకా కొనసాగుతున్నాయి. కానీ ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరదలు వచ్చే సమయానికల్లా నిర్మాణ పనుల్లో వేగం పెంచి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

గడువులోగా పూర్తి చేసేలా చర్యలు

బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్న మాట వాస్తవమే. అయితే ఇసుక కొరతతోనే పనులు వేగంగా జరగడం లేదు. ఇసుక కొరత లేకుండా చలాన్లు చెల్లించి అనుమతులు తీసుకుంటున్నాం. ఇసుక రాగానే బ్రిడ్జి నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాములు, డీఈ, ఆర్అండ్‌బీ

క్లుప్తంగా

అన్నపూర్ణా దేవికి వార్షికోత్సవ పూజలు



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో వెలసిన అన్నపూర్ణా దేవి అష్టమ వార్షికోత్సవ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కానగడ్డ బస్వరాజ్, సువర్ణ దంపతులు పాల్గొని అమ్మవారికి విషేశ పూజలు జరిపించారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి కల్యాణం, కుంకుమార్చన, తీర్థ ప్రసాదాల పంపిణీ, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శరణయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఖాళీ ప్రదేశాలు



మాగనూర్: మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఖాళీ ప్రదేశాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా మాగనూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ఖాళీ ప్రదేశంతో పాటు రైల్వేస్టేషన్ పరిసరాలను మందుబాబులు అడ్డాగా మార్చుకొని మద్యం తాగుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమైనప్పటికీ మందుబాబులు అవేం పట్టించుకోవడం లేదు. పోలీసులు సైతం ఈ విషయాన్ని అంతగా పట్టించుకోకపోవడంతో మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు మందుబాబులపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతు

ఊట్కూరు: ఊట్కూరు సబ్‌స్టేషన్‌లో ఏఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం విద్యుత్ మరమ్మతులు చేపట్టారు. ఊట్కూరు, కొల్లూరు, నాగిరెడ్డిపల్లి, సమస్తాపూర్ గ్రామాలలో విద్యుత్ తీగల దగ్గర పెరిగిన ముళ్ల పొదలను, చెట్లను తొలగించారు. పనులు చేపట్టడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది మల్లేష్, శీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు మంజూరు చేయాలి



కోస్గి రూరల్: కోస్గి డిపో పరిధిలో కొత్త బస్సులు మంజూరు చేయాలని కోస్గి డిపో ఇన్‌చార్జి బాలయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్గి డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులు నడపటానికి 10 ఎక్స్‌ప్రెస్, 10 ఆర్డీనరీ బస్సులను మంజూరు చేయాలని కోరారు. గ్రామాలకు సర్వీసులు నడిపితే డిపోకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పూర్వజన్మ సుకృతం



మరికల్: విద్యార్థుల భవిష్యత్‌ను మారుస్తున్న ఉపాధ్యాయ వృత్తి మనం చేసుకున్న పూర్వజన్మ సుకృతమని తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తీలేర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన భాస్కర్ అనే ఉపాధ్యాయుడిని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మానోరంజిన్ని, మాధవి, హెచ్ఎం నాగరత్నమ్మ, బాలనారాయణ, బాలరాజ్, నరసింహ, సురేష్, సికిందర్, శివశంకర్‌లు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో జన జాతర

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో భక్తుల జన జాతర కొనసాగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు మైసమ్మను దర్శించుకొని ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. దీంతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆదివారం మైసమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.